క్లుప్తంగా

తల్లిపాలతో శిశువుకు రక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకుమారి

కర్నూలు(హాస్పిటల్): తల్లిపాలతో శిశువు ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని కర్నూలు మెడికల్ కాలేజీ సామాజిక వైద్య విభాగం అధిపతి డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ సింధియా శుభప్రద అన్నారు. కాన్పు అయిన వెంటనే గంటలోపు తల్లులు తమ బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలని, వాటిలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక బుధవారపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇంటర్నీస్ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై చిత్రాలు వేసి తల్లులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు అరుణ, రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్ పీజీలు, పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): హంద్రీ – నీవా కాలువకు గండి పడడంతో దాదాపు 250 ఎకరాల్లో పంటలు కోతకు గురయ్యాయని, బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు గండి పడిన ప్రాంతాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారుల బాధ్యతారాహిత్యంతోనే కాలువకు గండి పడిందన్నారు. శాశ్వత ప్రతిపాదికన గండి పూడ్చివేత చేపట్టాలన్నారు. నాయకులు రాధాకృష్ణ, గురుశేఖర్, నగేష్ పాల్గొన్నారు.

ఆర్‌యూలో పరిశుభ్రతకు పెద్దపీట



వర్సిటీలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీ ప్రాంగణంలోని మెన్స్ హాస్టల్స్ వద్ద ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'పచ్చదనం – పరిశుభ్రత' కార్యక్రమం నిర్వహించారు. వీసీ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు,ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో అక్రమార్జనపై విచారణ జరపాలి



డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలంలో పనిచేస్తున్న వీఆర్వో మద్దిలేటి అక్రమ ఆస్తులపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ.. కల్లూరు మండలం సల్కాపురంలో సాధారణ కుటుంబంలో పుట్టిన మద్దిలేటికి అన్ని ఆస్తులు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించారు. వీఆర్వోగా ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై అక్రమంగా సంపాదించారని, ఆయనపై పూర్తి విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయన్నారు. నాయకులు హుస్సేన్‌బాషా, ప్రకాష్‌గౌతమ్ ఉన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ఆదోని రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేయించినట్లు సెబ్ ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ విన్నీలత తెలిపారు. స్థానిక ఇస్వీ రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద మొత్తం 37 కేసుల్లో సుమారు రూ.3.50 లక్షలు విలువ చేసే 476 లీటర్ల కర్ణాటక మద్యం, 108 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా కర్ణాటక మద్యం, నాటుసారా తయారీ లేదా సరఫరా చేసినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు.

ఇల వైకుంఠం.. గోదా గోకులం

- నగర శివారులో వెలసిన గోదా రంగనాథ స్వామి ఆలయం
- 108 దివ్య దేశాలకు ప్రతిరూపంగా 108 నిర్మాణాలు
- ఆధ్యాత్మిక శోభతో ఆకట్టుకుంటున్న అపురూప కట్టడాలు
- క్షేత్రంలో నేడు గోదాదేవి జయంతి వేడుకలు



మామిదాలపాడు వద్ద నిర్మించిన గోదా రంగనాథస్వామి ఆలయం



గోదాగోకులంలో రంగనాథస్వామి మూలవిరాట్

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులో పవిత్ర పుణ్యక్షేత్రం ఆవిష్కృతమైంది. సాక్షాత్తు విష్ణు రూపంలోని రంగనాథుడికి ఆలయం నిర్మించడం నగరానికి మకుటాయమానంగా నిలుస్తోంది. ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశేషాలతో గోదా గోకులం రూపకల్పన జరిగింది. నగరానికి చెందిన శ్రీ గోదా విష్ణు సహస్రనామ మండలి, శ్రీగోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గోదా విష్ణు నిత్యసేవాధామ్, శ్రీ గోదా పరివారం సంయుక్తంగా 5 ఎకరాల స్థలంలో రూ.100 కోట్లతో ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దారు. హరి నామమే కడు ఆనందమయమూ అన్నట్టుగా గోదా గోకులం సందర్శనం కొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. నగర శివారులోని మామిదాలపాడు గ్రామం వద్ద రాతి కట్టడంతో ఆలయం నిర్మాణం చేశారు. శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీ రంగనాథ పెరుమాళ్, సుదర్శన గరుడ, ఆళ్వారాచార్యుల దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం పైకప్పును గోదా రంగనాథ స్వామి చరిత్రను తెలిపేలా కళాత్మకతతో తీర్చిదిద్దారు

ప్రతి ఇళ్లు దేవాలయంలా..

ఇక్కడ ప్రతి ఇళ్లు ఒక దేవాలయంలా దర్శనమిస్తుంది. క్షేత్రంలోని 106 ఇళ్లు, ప్రవచన మండపం, ఆలయ నిర్మాణం కలిపి మొత్తం 108 దివ్య దేశాలకు ప్రతిరూపంగా దర్శనమిస్తున్నాయి. ఆలయం చుట్టూ మాఢవీధులలో లీలా విభూతిలోని 106 దివ్య దేశాల తిరునామాలతో 106 భాగవతుల తిరుమాళిగలు (గృహాలు), ఆ గృహాలపై శంఖు చక్ర తిరునామాలు, గరుడ, హనుమచిత్రాలు, ప్రతి గృహానికి ఒక దివ్య దేశపు పేరు, తిరుప్పావై భావనా చిత్రాలతో నిర్మించారు. గోశాలలు, వేద పాఠశాల, ధ్యాన మండపాలు ఏర్పాటు చేశారు. స్వామివారికి నిత్య కళ్యాణం, హోమ కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ స్వామివారిని ఊరేగించేందుకు అనువుగా విశాలమైన నాలుగు మాడ వీధుల నిర్మాణం అద్భుతమనే చెప్పాలి.

ఆలయ ఏర్పాటుకు అంకురార్పణ ఇలా..

1994లో కోట ఆంజనేయ స్వామి ఆలయంలో 40 రోజుల పాటు జరిగిన అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం, 8 రోజుల అఖండ శ్రీలక్ష్మీ అష్టోత్తర పారాయణంతో శ్రీ గోదా విష్ణు సహస్ర నామ మండలి ఏర్పాటైంది. శ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ఆశీస్సులతో మండలి ఏర్పాటయ్యింది. అతి కొద్ది మందితో ప్రారంభమైన ఈ భక్తి ఉద్యమం వందలాది మంది పరివారంతో భక్తి లోకానికి మార్గదర్శనం చేసే స్థాయికి ఎదిగింది. 31 సంవత్సరాలుగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణాలు ఇంటింటా చేస్తున్న కారణంగానే గోదా గోకులం ఆవిష్కృతమైందని గోదా గోకులం పరివారం అభిప్రాయపడుతున్నారు.

అరుదైన ఆలయం శ్రీరంగనాథుని క్షేత్రం

తుంగభద్ర నది సమీపంలో నిర్మితమైన గోదాగోకులం అరుదైన ఆలయంగా నిలుస్తోంది. శ్రీ రంగనాయకి గోదా సమేత శ్రీ రంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆళ్వారాచార్యుల దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాటు చేశారు. ఆలయంలో శేషవాహనంపై పవళించిన శ్రీరంగనాథుడు భక్తులకు దర్శనమిస్తారు. తమిళనాడులోని శ్రీరంగం క్షేత్రం తరువాత అతిపెద్ద రంగనాథుడి ఆలయం కర్నూలులో ఏర్పాటు కావడంతో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతి చెందుతున్నారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

గోదా జయంతిని పురస్కరించుకొని బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల వివరాలను గోదాగోకులం సభ్యులు వెల్లడించారు. ఉదయం 6.30 గంటల నుంచి నిత్య ఆరాధన, తీర్థగోష్ఠి, మంగళవాయిద్యాలతో కైంకర్య పరులచే అష్టోత్తర శతకలశాలతో (108) పూజా ద్రవ్యాలతో ఆలయ ప్రదక్షిణ, గోదా దేవి అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనం, ఉదయం 11 గంటలకు పట్టు వస్త్రాల సమర్పణ, తోమాలలు, అలంకరణ, వడిబియ్యం సారె సమర్పణ, నాచ్చియార్ తిరుమొళి, తిరుప్పావై పాశురాల సేవ, సాయంత్రం 5 గంటలకు నిత్య ఆరాధన, తీర్థగోష్ఠి, ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు తిరుమాడ వీధుల్లో శ్రీ గోదాదేవి అమ్మవారికి గజవాహన సేవ, పవళింపు సేవ కార్యక్రమాలు జరగనున్నాయి.

నగరానికి మణిమకుటం



నగర శివారులో నిర్మితమైన గోదా గోకులం మరో ఇల వైకుంఠపురంగా, కర్నూలుకు మణిమకుటం వెలుగొందుతోంది. గోదా గోకులం ప్రాంగణంలోకి అడుగు పెడితే ఆధ్యాత్మిక ప్రపంచంలో విహరించిన భావన కలుగుతోంది. అర ఎకరంలో రంగనాథుని ఆలయం, మిగతా 4.30 ఎకరాల్లో విష్ణు సహస్ర నామ మండలి సభ్యులు 106 మంది గృహాలు నిర్మించుకున్నారు. సభ్యులందం ఐకమత్యంగా మెలుగుతూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తున్నాం. – మారం నాగరాజు గుప్త, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు



ఆలయం లోపలి దృశ్యం



గోదా రంగనాథస్వామి ఆలయం



రంగనాథస్వామి మహిమలను తెలిపే చిత్రాలతో నిర్మించిన గృహాలు



స్వామివారి గర్భగుడి

'పారదర్శకంగానే వ్యవహరించారు'

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చేపట్టిన ఉద్యోగాల భర్తీలోను, మరణించిన వ్యక్తికి రుణం మంజూరు చేయడంలోను, ఒక మేనేజర్ పదవీ విరమణ కాలానికి మించి ఆరు నెలలు కొనసాగిన విషయంలోనూ అప్పట్లో సీఈఓగా పనిచేసిన పి.రామాంజనేయులు తప్పిదం లేదని ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయకుమార్ తెలిపారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'తప్పుల భయంతోనే తప్పుకున్నారు' శీర్షికపై ప్రచురితమైన కథనానికి సీఈఓ విజయకుమార్ వివరణ ఇచ్చారు. సీఈఓగా రామాంజనేయులు ఎలాంటి తప్పు చేయలేదని, అన్ని అంశాల్లో పారదర్శకంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు. ఇదిలాఉంటే డీసీసీబీ సీఈఓ పదవికి వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు మాజీ సీఈఓ, జనరల్ మేనేజర్ రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు.

కారుణ్య నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంటుగా పనిచేస్తూ గుండెపోటుతో మరణించిన తిరుమలరావు కుమార్తె దీప్తికి జూనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగం లభించింది. 2023 సెప్టెంబరు 1న తిరుమల రావు మరణించారు. అయితే ఆయన కూతురు దీప్తికి ఉద్యోగం ఇవ్వడానికి అర్హత వయస్సు లేకపోవడంతో కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం అర్హత వయస్సు రావడంతో కారుణ్యం కింద జూనియర్ అకౌంటెంట్‌గా నియమిస్తూ జిల్లా ట్రెజరీ ఇన్‌చార్జ్ అధికారి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు కాపీని దీప్తికి అందజేశారు. ఎస్‌టీఓ పలనాటి సునీల్ ఉన్నారు.

దుకాణదారులు శుభ్రత పాటించాలి

కర్నూలు (టౌన్): నగరంలో దుకాణాదారులు షాపు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, జేఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్ తదితర కాలనీలలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొందరు దుకాణదారులు పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే వ్యవహరిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): మానసిక ప్రశాంతతతోనే శారీరక ఆరోగ్యం లభిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినం పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నా మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గమనం లయ తప్పుతుందన్నారు. నిద్రలేమి, అతినిద్ర, ఒంటరితనం, పరిస్థితులకు తగ్గట్లు సర్దుబాటు కాలేకపోవడం, అతికోపం, అనుమానాలు, వ్యసనాలకు బానిస కావడం, మతిమరుపు, ఆందోళనకు గురికావడం, వారిలో వారే నవ్వుకోవడం వంటి లక్షణాలున్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత మాట్లాడుతూ వివిధ రకాల మానసిక సమస్యల పరిష్కారానికి టెలిమానస్ ఎంతో ఉపయుక్తం అని తెలిపారు. మానసిక ఒత్తిడి, భయాందోళనలు, ఇతర సమస్యలు ఉన్న వారు టెలిమానస్ 14416కు ఫోన్ చేసి మీ సమస్యలు తెలపాలన్నారు. ఇక్కడ సుశిక్షితులైన సైకియాట్రిస్టులు, కౌన్సిలర్లు తగిన సలహాలు, సూచనలు అందిస్తారని చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నంబర్ 30లో ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చన్నారు. అనంతరం గార్గేయపురంలో నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ చైతన్య, డీపీఎంయూ డాక్టర్ ఉమ, డీపీఓ విజయరాజు, ఎస్ఓ హేమసుందరం, డెమో శ్రీనివాసులుశెట్టి, వైద్యాధికారి బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ వైద్యాధికారులు

ఎన్‌క్యాప్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) పథకానికి సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా సిద్ధం చేయాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం నగరపాలకలోని కౌన్సిల్‌హాలులో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ఆరోగ్య, హార్టికల్చర్ విభాగాల అధికారులతో ఎన్‌క్యాప్ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్‌క్యాప్ ప్రోగ్రాం కింద రూ.7.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో డివైడర్ల మధ్యన పచ్చదనం, పార్కుల నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు, జంక్షన్‌లలో వాటర్ ఫౌంటెన్లు, డస్ట్ అదుపు చేయడం తదితర పనులు చేయాల్సి ఉందన్నారు. ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఈఈ షాకీర్‌హుస్సేన్, డీసీపీ సంధ్యారాణి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

'విద్యార్థి బస్సు' ఏర్పాటు చేయాలి

కర్నూలు సిటీ: గూడూరు మండలం జూలకల్లులోని ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు సకాలంలో బడికి చేరుకునేలా విద్యార్థి బస్సును ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్ మంగళవారం కర్నూలు–2 డిపో అసిస్టెంట్ మేనేజర్ దీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. మోడల్ స్కూల్‌కు గూడూరు మండలంలోని నాగులాపురం, పెంచికలపాడు, బూడిదపాడు, గుడిపాడు, మునగాల, గూడూరు, పొన్నకల్ గ్రామాల నుంచి ప్రతి రోజు 200 మందికిపైగా వస్తుంటారన్నారు. స్కూల్‌కు సమయానికి చేరుకునేందుకు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వినతిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అసిస్టెంట్ మేనేజర్ హామీఇచ్చారు.

అంధ ఉద్యోగినిపై చులకన భావం తగదు

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా గడివేముల వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న పుట్టుకతో అంధురాలైన గువ్వల నాగ అంజనమ్మ పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్లా సుబ్బయ్య, అటెండర్ తిమ్మరాజును సస్పెండ్ చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన యువసేన అధ్యక్షుడు చంద్రాచెర్ల హరి, వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షులు తలారి కృష్ణనాయుడు మాట్లాడుతూ.. అంధురాలనే కనికరం లేకుండా ప్లేట్లు, క్యారియర్లను శుభ్రం చేయిస్తున్నారని, కార్యాలయంలోనే వంట గది ఏర్పాటు చేసుకొని అంధురాలి తల్లితో వంట చేయించుకుంటున్నారన్నారు. వెట్టి చాకిరి చేయించుకోవడమే గాక ఉద్యోగానికి పనికిరావని సూటిపోటి మాటలతో వేధిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు. వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘాల నాయకులు

న్యాయవాదుల సమస్యలపై మంత్రికి వినతి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి టీజీ భరత్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, ప్రధాన కార్యదర్శి రవికాంత్, మురళి, మోహన్ బాబు, వెంకట్రావు, షాబుద్దీన్, సుమన రాణి, విక్రమ్ సింగ్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చొరవ చూపాలని, న్యాయవాదుల కార్యాలయం ఏర్పాటుకు నిధులు కేటాయించి సహాయం చేయాలని కోరారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కర్నూలు (లీగల్): స్థానిక టౌన్ మోడల్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డీసీపీయూ శారద అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టం ప్రకారం శిక్ష పడుతుందన్నారు. విద్యాహక్కు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, దేశభక్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు టౌన్ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్‌క్లబ్‌ను కూడా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

బాలిక మృతిపై అనుమానాలు

కర్నూలు(అర్బన్): మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని కురువ పార్వతిది ముమ్మాటికి హత్యేనని జిల్లా కురువ సంఘం నేతలు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ.. బాలిక శరీరంపై గాయాలున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గదిలో ఫ్యాన్ బాలికకు అందే పరిస్థితి లేకపోయినా ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రులకు ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బూడురు లక్ష్మన్న, కొత్తపల్లి దేవేంద్రం, మల్లికార్జున, వీరనాగప్ప తదితరులు ఉన్నారు.

డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలన

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన కావలి చిన్న నరసన్న (52) తన పొలంలో అనుమానస్పదంగా మృతి చెందడాన్ని సోమవారం గుర్తించారు. దీనిపై ఆస్పరి సీఐ హనుమంతప్ప డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్‌తో ఏఎస్ఐ పురుషోత్తం పొలం పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీం ఇన్‌చార్జ్ షేక్ అన్వర్ పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించేందుకు తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కర్నూలు(అర్బన్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం నాయకులు చొరవ చూపాలని పంచాయతీరాజ్ పీఐయూ ఈఈ రామకృష్ణారెడ్డి కోరారు. ఈ నెల 4వ తేదీన జరిగిన పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జెడ్పీ యూనిట్ ఎన్నికల్లో పీఐయూ కార్యాలయ పర్యవేక్షకులు జీవీ కృష్ణారెడ్డి అసోసియేట్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక పీఐయూ కార్యాలయంలో ఈఈ రామకృష్ణారెడ్డి, పీఆర్ ఈఈ మద్దన్న, డీఏఓ మధు, కార్యాలయ సిబ్బంది కృష్ణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏ టు ఈఈ శిల్పాశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డిని అభినందిస్తున్న ఈఈలు, ఉద్యోగులు

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్ చెప్పారు. బాల సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మునగాలపాడు గ్రామంలోని బాలసాయి కంటి వైద్యశాల ఆవరణలో ట్రస్ట్ మేనేజర్ రామారావు సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. మన శరీరంలో అతి ముఖ్యమైన భాగమైన కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, కంటి సమస్యలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బాలీశ్వరయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, ఆర్ఎంపీ మద్దయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే గద్దె దింపుతాం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇంటికి పంపుతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేలాది మంది విద్యార్థులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముందుగా సీఆర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 76 హాస్టళ్లు ఉంటే దాదాపు 70 శాతం హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవన్నారు. చాలా హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని వివరించారు. వెంటనే నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కొన్ని హాస్టళ్లలో విద్యార్థులు పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వార్డెన్, ఇతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీలను భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు రంగస్వామి, థామస్, వీరేష్, దస్తగిరి, అల్తాఫ్, శ్రీకాంత్, శరత్‌కుమార్, శ్రీరంగ, శ్రీనివాసులు, అభి పాల్గొన్నారు.